క్లుప్తంగా

హోటళ్ల ఆకస్మిక తనిఖీ



హోటల్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని పలు హోటళ్లను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తనిఖీ చేశారు. హోటళ్లల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రజల ఆరోగ్యంపట్ల ప్రతి హోటల్ యజమాని ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రై డే పాటించాలి



మురికినీటిలో ద్రావణాన్ని పిచికారి చేస్తున్న సిబ్బంది

కమలాపురం : ప్రతి శుక్రవారం ప్రజలందరూ డ్రై-డే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి తెలిపారు. శుక్రవారం స్థానిక అక్సానగర్‌లో జరిగిన డ్రై-డే కార్య క్రమాన్ని ఆయన పరిశీలించి ప్రజలకు డ్రై-డే గురించి అవగాహన కల్పించారు. నీరు నిల్వ చేసే పాత్రలన్నీ కడిగి శుభ్రం చేసి ఆరబెట్టాలన్నారు. అప్పుడు అందులో ఎలాంటి లార్వాలు చేరవని, తద్వారా ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. అలాగే నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అబెట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. రోడ్లపై మురికి నీరు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం అరుణ, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏగ్రేడ్ వచ్చేలా శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న లిప్ మానటరింగ్ అబ్జర్వర్ శ్రీనివాసులు

వేంపల్లె : విద్యార్థులకు ఏగ్రేడ్ వచ్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని లిప్ మానటరింగ్ అబ్జర్వర్ సి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు బోధన, ప్రాక్టీస్ పిరియడ్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లిప్ నిర్వహణపై ప్రతి ఉపాధ్యాయుడు శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రాక్టీస్ పీరియడ్‌లో విద్యార్థుల అభ్యసనను మెరుగుపరచడంలో పరతి ఉపాధ్యాయుడు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాజా పర్వీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లెలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు విద్యాసాగర్‌రెడ్డి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం కీళ్ల వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాల్షియం ఉత్పత్తి అయ్యేందుకు గుడ్డు, పాలు, ఆకుకూరలు బాగా తీసుకోవాలని, వ్యాయామం తప్పని సరిగా చేయాలన్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

కమలాపురం : మండలంలోని జంగంపల్లెకు చెందిన మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డిలను విచారించి తప్పు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిల మధ్య స్థల వివాదం ఉంది. వారిద్దరు ఇప్పటికే పలుమార్లు వాగ్వివాదానికి దిగారు. శుక్రవారం మధుసూదన్‌రెడ్డి, దీపక్‌రెడ్డి అనే వ్యక్తితో కలసి వెళుతుండగా జనార్ధన్‌రెడ్డిపై ఘర్షణకు దిగడానికి వెళ్తున్నట్లు తమకు సమాచారం వచ్చింది. దీంతో వారిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకుని వచ్చి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డిని స్టేషన్‌కు పిలిచి విచారించి తప్పు చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చాపాడు ఉపాధ్యాయురాలి ప్రాజెక్ట్

చాపాడు : విద్యా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మైక్రో ఇన్నోవేటివ్ ప్రాజెక్టులో భాగంగా ఇటీవల జరిగిన కార్యక్రమంలో చాపాడు మండలం మొర్రాయిపల్లెలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన మ్యాథమేటిక్స్ అండ్ పర్మనెంట్ టీఎల్‌ఎం ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో 4,525 ప్రాజెక్టులు పోటీలో పాల్గొనగా వీటిలో మొర్రాయిపల్లెకు చెందిన టీచర్ ఎం.నాగలక్ష్మీదేవి రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైంది. రాష్ట్ర స్థాయికి వివిధ జిల్లాల నుంచి 11 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.

కన్న తండ్రే కాలయముడు

- అల్లుడితో విభేదించి పుట్టింటికి వచ్చిన కుమార్తె
- నచ్చజెప్పినా వినకపోవడంతో గొంతు నులిమి హత్య
- తల, మొండెం వేరు చేసి నల్లమల లోయలో పడేసిన వైనం
- 15 రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘాతుకం
- పెద్దయుడియంకు చెందిన తాత ఫిర్యాదుతో విచారణ



ప్రసన్న (ఫైల్)

పాణ్యం (నంద్యాల జిల్లా): అత్తింటి నుంచి విభేదించి పుట్టింటికి వచ్చిన కుమార్తెను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తండ్రే దారుణంగా హత్య చేశాడు. తల్లి లేని బిడ్డను ఆదరించాల్సిన నాన్నే ఘాతుకానికి పాల్పడ్డాడు. చెప్పిన మాట వినడం లేదని చంపేసి, మృతదేహాన్ని ఎవరూ గుర్తించకుండా తల, మొండెం వేరు చేసి నల్లమల లోయలో పడేశాడు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో ఈ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆలమూరు గ్రామానికి చెందిన దేవేంద్రారెడ్డికి ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె ప్రసన్న (21)ను రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పని చేసే జిల్లెల గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కాగా కొద్ది నెలలకే ప్రసన్న తన భర్తపై విభేదించి పుట్టింటికి చేరుకుంది. పలుమారులు పెద్ద మనుషులు, బంధువుల సమక్షంలో పంచాయితీ చేసి నచ్చజెప్పినా మెట్టినింటికి వెళ్లేందుకు ఒప్పుకోలేదు. ఈనెల 10వ తేదీన రాత్రి దేవేంద్రారెడ్డి మరోసారి కుమార్తెను బుజ్జగించే ప్రయత్నం చేశాడు. అయితే తాను వెళ్లనని ఆమె తెగేసి చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన దేవేంద్రారెడ్డి ప్రసన్న గొంతు నులిమి చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని మాయం చేసేందుకు కొందరి సాయంతో వాహనంలో నంద్యాల – గిద్దలూరు ఘాట్‌రోడ్డులో అటవీ ప్రాంతానికి తరలించారు. అయితే మృతదేహాన్ని ఎవరూ గుర్తు పట్టకుండా తల, మొండెం వేరు చేసి వేర్వేరు చోట్ల పడేసి ఏమి తెలియదన్నట్లుగా ఇంటికి చేరుకున్నారు.

తాత ఫిర్యాదుతో వెలుగులోకి..

దేవేంద్రారెడ్డి మొదటి భార్యది వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం సుంకేసుల గ్రామం. ఆమె ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తె ప్రసన్నను తండ్రి దేవేంద్రారెడ్డి చదివించిపెళ్లి చేశాడు. ఇటీవల ఆయన రెండో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మెట్టినింటి నుంచి అలిగి వచ్చిన కుమార్తె పెద్దల మాట వినకపోవడంతో చంపేసి మృతదేహాన్ని అడవిలో పడేసి వచ్చాడు. అయితే పది రోజులుగా మనువరాలు ఆచూకీ లేకపోవడంతో పెద్దముడియం మండలం సుంకేసులకు చెందిన తాత శివారెడ్డి అనుమానించాడు. అల్లుడు దేవేంద్రరెడ్డిని నిలదీయగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగలోకి దిగిన పోలీసులు దేవేంద్రరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా కుమార్తెను చంపి మరికొందరి సహకారంతో ఎవ్వరికి అనుమానం రాకుండా నల్లమల్ల ఫారెస్టులోని బొగద వద్ద పడేసినట్లు చెప్పాడు. పోలీసులు అడవిలో రెండు రోజులుగా గాలించి శుక్రవారం సాయంత్రం 300 అడుగుల లోయలో ఉన్న ప్రసన్న మొండాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవేంద్రారెడ్డిపై కేసు నమోదు చేశామని, ప్రసన్న తల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రసన్న కాపురానికి వెళ్లకపోవడానికి ప్రేమ వ్యవహారం కారణమని పోలీసులు తేల్చారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ కోతలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని మెయిన్ రోడ్డు నుంచి మోర్ సూపర్ మార్కెట్ వరకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 5 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సత్రంబడి పాఠశాల వద్ద కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ కోత ఉంటుందని ప్రజలు సహకరించాలన్నారు.

ఓపెన్ స్కూలు పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

లింగాల : ఇంటర్ విద్యను మధ్యలో మానివేసిన విద్యార్థులు ఓపెన్ స్కూలు ద్వారా పరీక్షలు రాసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని లింగాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈనెల 27వ తేదీలోగా ఏపీ ఓపెన్ స్కూలు ఏపీ.జీఓవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వారి విద్యను కొనసాగించేందుకు ఇది చక్కటి అవకాశమన్నారు. ఏప్రిల్ మాసంలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రక్తహీనత ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు

చెన్నూరు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాకుండా రక్తహీనత ఉన గర్భిణులు, ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక గ్రామ సచివాలయం–1 పరిధిలోని గర్భిణులు, బాలింతలను వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలని, ప్రతి ఇంటిలో నిల్వ ఉన్న నీటిని తొలగించి తిరిగి మంచినీరు నిల్వ ఉంచుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలలో చెత్తాచెదారాలు లేకుండా చూసుకోవాలని, నీటి గుంతలు ఉంటే వాటిని పూడ్చివేయడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించిన ఆయన వైద్య సేవలను ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, ఎంపీహెచ్ ఈఓ ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైవ్‌సర్టిఫికెట్ అందించాలి

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఈనెల 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్‌ను అందజేయాలని పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు పొన్నూరి దస్తగిరి, అధ్యక్షుడు సదేవదానము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఈ సర్టిఫికెట్‌ను అందించాలని వారు కోరారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి



శనగల కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

వేముల : ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న శనగల తూకాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పాత ఐటీఐలో నిర్వహిస్తున్న శనగల కొనుగోళ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తీసుకొచ్చిన శనగలను సకాలంలో తూకాలు వేసుకుని నాణ్యత ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎర్రగుంట్ల : వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా మన రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎనలేని సేవలు చేస్తున్నారన్నారు. శాసనమండలి స్థానాలలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు అనేక పదవులు కేటాయించారన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

కడప అర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా విధులను నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన వై. శ్రీనివాసులు (హెచ్‌జి 207) కుటుంబానికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సంబంధిత చెక్కును అందజేశారు. హోంగార్డు వితరణ నిధి నుంచి హోంగార్డు శ్రీనివాసులు సతీమణి వై. రమాదేవికి ఈ ఆర్థిక సాయం చేశారు. ఈకార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ పూజిత నీలం, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత లేదు



గోనె సంచుల వద్ద నాఫెడ్ బ్రాంచ్ మేనేజర్ టి.ఎస్.శర్మ, జిల్లా మార్కెఫెడ్ డీఎం నరసింహారెడ్డి

పెద్దముడియం : జిల్లా వ్యాప్తంగా బుడ్డ శనగల కొనుగోలుకు ఏర్పాటు చేసిన కేంద్రాలలో గోనె సంచుల కొరత లేదని స్టేట్ నాఫెడ్ బ్రాంచ్ మేనేజర్ టి.ఎస్.శర్మ తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు, పెద్దపసుపుల గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా మార్కెఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డితో కలసి ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కోనుగోలు కేంద్రాలకు 3 లక్షల గోనె సంచులు కొనుగోలు కేంద్రాలకు వచ్చాయని మరో రెండు రోజుల్లో మరో లక్ష గోనె సంచులు వస్తాయన్నారు. అనంతరం ఆయన కొనుగోలు కేంద్రాలలో రిజిస్టర్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడికి వచ్చిన రైతులు శనగల దిగుబడిలో నల్ల గింజలు అక్కడక్కడ వచ్చాయని ఆయన దృష్టికి తీసుకురాగా 4 శాతం కన్న డ్యామేజీ తక్కువ ఉన్న శనిగలు మాత్రమే కొనుగోలు చేస్తారని తెలిపారు. అనంతరం మార్కెఫెడ్ డీఎం నరసింహారెడ్డి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లడుతూ శనగల కొనుగోలులో నాణ్యమైన శనగలను మాత్రమే కొనుగోలు చేయాలని అలాగే నాణ్యమైన శనగలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన శనగల బస్తాలు దిగుమతి గోదాముల వద్ద నాఫెడ్ అధికారులు రిజెక్ట్ చేస్తే దానికి పూర్తి బాధ్యత కొనుగోలు నిర్వాహకులు వహించాల్సి ఉంటుందని ఆయన సూచించారు. గతంలో గోనె సంచుల కొరత ఉండేదని ఈ సంవత్సరం కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మల కృషి వల్ల సంచులు పూర్తిస్థాయిలో జిల్లాకు తొందరగా రావడం జరిగిందన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ తప్పనిసరి



పెట్రోలు బంకులో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

వేంపల్లె : ప్రతి ఒక్కరూ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు మేరకు తమ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, ఎవరికైనా ఆన్‌లైన్‌లో ఆధార్ అనుసంధానంలో ఇబ్బందులు ఉంటే రెవెన్యూ కార్యాలయంలోని బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు.

నాణ్యమైన పెట్రోలు విక్రయించాలి :

వినియోగదారులకు నాణ్యమైన పెట్రోలు విక్రయించాలని తహసీల్దార్ పెట్రోలు బంకు యజమానులకు సూచించారు. పట్టణంలోని పులివెందుల రోడ్డులో ఉన్న ఎస్ఆర్ పెట్రోలు బంకును ఆయన తనిఖీ చేసి రికార్డులను, పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకులలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం పరిశీలన



శనగల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

సింహాద్రిపురం : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ మహబూబ్‌బాషా పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.5335 ప్రకారం కొనుగోలు చేయాలని.. అలాగే తూకాలలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తెలిపిన ప్రమాణాల ప్రకారమే కొనుగోలు చేయాలన్నారు. మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం మార్పు :

మండల కేంద్రమైన సింహాద్రిపురం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నూతన భవనాలు నిర్మిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ కార్యాలయాన్ని తాత్కాలికంగా పోలీస్‌స్టేషన్ పక్కలో ఉన్న సచివాలయం–2 లోకి మార్చడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్ రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు తదితర వాటికి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు నిర్వహించాలనుకునేవారు పరగడపున ఏమి తినకుండా రావాలన్నారు.

ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మనులో 28న నేషనల్ సైన్సు డే



జాతీయ సైన్సుడే పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్ ఉర్దూ యూనివర్సిటీలో ఈనెల 28న నేషనల్ సైన్సు డే–2023ను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కళాశాల ఆవరణలో అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ మాట్లాడుతూ సైన్సడే లో భాగంగా విద్యార్థులు మోడల్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, కాన్సెప్ట్ వీడియో ప్రెజెంటేషన్ ఇవ్వొచ్చని తెలిపారు. జిల్లాలో ఉన్న స్కూల్స్, ఐటీఐ మరియు డిప్లమోకు సంబంధించిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుం లేదని తెలిపారు. మరిన్ని వివరాలకు 9398083058 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ హాకీముద్దీన్ అహ్మద్, విలయత్ అలీబైగ్, డాక్టర్ సోయబ్, నసార్ ఆయూబ్, ఖాజామొయినుద్దీన్, సికిందన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

ముద్దనూరు : ముద్దనూరు–పులివెందుల మధ్య జాతీయ రహదారి నిర్మాణానికి చేపడుతున్న భూసేకరణలో నిర్వాసిత రైతులు ప్రభుత్వానికి సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో భూసేకరణపై రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. జాతీయ భూసేకరణ, పరిహారం నియమ నిబంధనల మేరకే భూసేకరణ చేపట్టి పరిహారం అందిస్తున్నట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సేకరణపై సంబంధం లేదని ఆయన తెలిపారు. మార్కెట్ విలువను ఆధారంగా చేసుకుని గత 3 సంవత్సరాలుగా జరిగిన భూ క్రయ విక్రయాల లావాదేవీలను పరిశీలించి భూమికి పరిహారం అందిస్తున్నామని, పరిహారం పంపిణీపై ఎవరికైనా అభ్యంతరాలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలో దలకుంట, ముద్దనూరు, చిన్నదుద్యాల, నల్లబల్లె, పెద్దదుద్యాల గ్రామాలకు చెందిన సుమారు 41.89 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు, ఆయా గ్రామాల రెవెన్యూ సిబ్బంది నిర్వాసితులకు అందుబాటులో వుండి సమాచారం అందించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, డీటీ సౌజన్య, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



తొండూరులో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు, తదితరులు

వేముల, తొండూరు, సింహాద్రిపురం : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.రామచంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు కోరారు. గురువారం మండల పరిధిలోని నల్లచెరువుపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వారు నిర్వహించారు. అలాగే తొండూరు మండంలోని సంతకొవ్వూరు, అగడూరు, ఇనగలూరు, మల్లేల, తొండూరు కస్తూర్బా గాంధీ, జూనియర్ కళాశాలల్లో, అలాగే సింహాద్రిపురం మండలంలోని రావులకొలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ టీఎఫ్ నాయకులు వెంకటనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణ, సూరి, దశరత, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, అపుస్మా నాయకులు సుభాష్, జేఎల్ అసోసియేషన్ రామచంద్ర, ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిపై శాటిలైట్ సిటీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులు గాయపడ్డారు. వల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ధీరజ్ విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. వల్లూరుకు పని మీద వచ్చిన పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజేష్‌బాబు ధీరజ్ బైక్‌లో ఎక్కాడు. కడప వైపు నుంచి కమలాపురం వైపు వస్తున్న కారు ముందుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధీరజ్ కాలు విరగగా, రాజేష్ బాబు తలకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స కోసం 108 వాహనంలో కడపలోని ఆసుపత్రికి తరలించారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

వైవీయూ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉన్నతవిద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. బాబు పేర్కొన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో రసాయనశాస్త్రశాఖ, ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ సహకారంతో 'పొల్యూషన్ కంట్రోల్ అండ్ సస్టెయినబుల్ ఎన్విరాన్‌మెంట్' అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ కాలుష్య సమస్యకు ఇలాంటి సదస్సులు పరిష్కారం చూపాలని సూచించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యానికి మనందరం బాధ్యులమేనన్నారు. అదే విధంగా కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన తిరుపతి ఐఐటీ కెమిస్ట్రీశాఖ అధ్యాపకులు డా. కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధునాతన విధానాల గురించి వివరించారు. సదస్సు డైరెక్టర్ డా. సి. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 100కుపైగా పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు.